క్లుప్తంగా

19న ద్వాదశ గణపతుల విగ్రహాల ప్రతిష్ఠ



ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామ శివారులోని సిద్ధి వినాయక క్షేత్రంలో ఈనెల 19న ద్వాదశ గణపతుల విగ్రహాల వాయు ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు వెలుగూరి సత్యనారాయణ మూర్తి శనివారం తెలిపారు. గ్రామ శివారులో నిర్మించిన మూడంతస్తుల మండపంలో మండపానికి నాలుగు విగ్రహాల వంతున 12 గణపతుల విగ్రహాల వాయు ప్రతిష్ఠ నిర్వహిస్తామని చెప్పారు. గాయత్రీ పరివార్‌కు చెందిన ఇసిరెడ్డి భాస్కరరెడ్డి ప్రతిష్ఠ కార్యక్రమాల్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. విశేష పూజల అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



మంగళగిరి: నగరంలోని పలు కూడళ్లలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తామని తెలిపారు. అనుమానం ఉన్న వాహనాల్ని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. రౌడీషీటర్లు భూదందాలు, అధిక వడ్డీలు వసూలు చేయడం, సెటిల్‌మెంట్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో అసాంఘిక కార్యక్రమాలను ఉపేక్షించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు.

చిత్తశుద్ధితో పనిచేసే ఉద్యోగులకే ప్రజల ప్రశంసలు



ఫిరంగిపురం: చిత్తశుద్ధితో పనిచేసే ఉద్యోగులకు ప్రజల నుంచి ప్రశంసలు అందుతాయని ఎస్‌ఐ వీరనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్‌ ఆడిటోరియంలో ఇటీవల ఏఎస్‌ఐగా స్థానిక పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కొప్పుల మోహన్‌రావును శనివారం సన్మానించారు. ఎస్‌ఐలు వీరనారాయణ, సదాశివరావులు మోహన్‌రావుకు పూలమాలలు వేసి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35ఏళ్ల సర్వీసులో మోహన్‌రావు అనేకచోట్ల పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, రైటర్‌ దాసు, పోలీసు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్‌ వార్షికోత్సవం



తాడికొండ: మండల కేంద్రమైన తుళ్లూరులో యూటీఎఫ్‌ 50వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రరీ సెంటర్‌ వద్ద పతాకావిష్కరణ చేశారు. అనంతరం పలువురు నేతలు సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి యు. రాజశేఖర్‌, సీనియర్‌ నాయకులు కొండవీటి రాజయ్య, కన్వీనర్‌ ఆడివి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు అల్లంశెట్టి రఘునాథ్‌, మండల అధ్యక్షులు పి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టి.భాస్కరరావు, సహాధ్యక్షులు ఇందుమతి, వి. ప్రసాద్‌, ఎ. కల్యాణ్‌, సీహెచ్‌. శివబాబు, బి.శివాజీ, జయలక్ష్మి, ఎన్‌బీ మున్నీ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

నగరంపాలెం: విశ్రాంత ఉద్యోగి ఇంట్లో నగదు చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కంకరగుంట గేటు ఒకటో వీధిలో ఉంటున్న సుబ్రహ్మణ్యశాస్త్రి విశ్రాంత ఉద్యోగి. భార్యాభర్తలు ఇంట్లో ఒంటరిగా ఉంటారు. వైద్య సేవలు నిమిత్తం ఇటీవల పోస్టాఫీస్‌లో రూ.2.10 లక్షలు డ్రా చేసి, బీరువాలో దాచుకున్నారు. శనివారం ఉదయం లేచేసరికి నగదు కనిపించలేదు. దీంతో నగరంపాలెం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

కుమార్తె అదృశ్యంపై తండ్రి నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరంపాలెంలో ఓ యువతి అద్దెకు ఉంటూ అరండల్‌పేటలోని ఓ దుకాణంలో పని చేస్తోంది. అయితే ఆమె రావడంలేదని దుకాణ యజమాని శ్రీశైలంలో ఉంటున్న తండ్రి సోమేశ్వరరావు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన నగరంపాలెంలో వెదికినా కుమార్తె ఆచూకీ కనిపించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జగన్‌ పేరు తొలగించడం దారుణం



జాతిపిత విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తదితరులు



తాడికొండలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- పార్టీ మారడం అంతా దుష్ప్రచారం
- అలాంటి ఆలోచనే లేదు..అవసరం లేదు

మంగళగిరి: తాను పార్టీ మారుతున్నానని అంతా దుష్ప్రచారం చేస్తున్నారని, దాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు స్పష్టం చేశారు. పార్టీ మారే ఆలోచన లేదని, అలాంటి అవసరం లేదని తెలిపారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ విగ్రహం వద్ద మాజీ సీఎం వైఎస్‌. జగన్‌మోహన్‌రెడ్డి పేరు ధ్వంసం చేయడంపై పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద శనివారం పార్టీ నాయకులతో నిరసన తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. లోకేష్‌తో జరిగిన కార్యక్రమం కుల సంఘానికి సంబంధించింది కావడంతో హాజరయ్యానని తెలిపారు. కులానికి మంచి చేయాలని కోరితే, దాన్ని కొందరు కావాలనే దుష్ప్రచారం చేయడం దారుణమని ఖండించారు. తాను ఎప్పటికీ వైఎస్సార్‌ సీపీకి చెందిన ఎమ్మెల్సీనని..పార్టీ మారే యోచన కాని అవసరం కాని తమకు లేదని మురుగుడు హనుమంతరావు తెలిపారు.

అంబేడ్కర్‌ విగ్రహంపై దుశ్చర్యలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న నాయకులు సంఘటనపై విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌ యార్డు మాజీ చైర్మన్‌ సుంకర రఘుపతిరావు, పార్టీ నాయకులు ఈపూరి ఆదామ్‌ , గుంటి రాజ్యలక్ష్మి, బేతపూడి నరసయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తాడికొండ: విజయవాడలోని అంబేడ్కర్‌ న్యాయ మహా శిల్పం, స్మృతి వనంపై జరిగిన దాడి ఘటనలో నిందితుల్ని గుర్తించి వెంటనే శిక్షించాలని తాడికొండ మండల వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, తుళ్లూరు మండల ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు డిమాండ్‌ చేశారు. శనివారం తాడికొండ పోలీస్‌ స్టేషన్‌ కూడలిలోని అంబేడ్కర్‌ కాంస్య విగ్రహం ఎదుట కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించిన అనంతరం నేతలు మాట్లాడారు. అంబేడ్కర్‌ విగ్రహం సాక్షిగా టీడీపీ నాయకులు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని ఖండించారు. రాజ్యాంగ నిర్మాతను అడ్డుపెట్టుకొని ధ్వంసానికి పూనుకొని రాజకీయాలు చేయడం ప్రపంచ చరిత్రలో హీనమైన సంస్కృతి అన్నారు. మాజీ సీఎం వైఎస్‌. జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక టీడీపీ నీచమైన పనులకు పూనుకుంటోందని ధ్వజమెత్తారు. కూటమి పేరుతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు ప్రజల గుండెల్లో స్థానం ఎప్పటికీ ఉండదని గుర్తుంచుకొని మసలుకుంటే మంచిదని హితవు పలికారు. అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన బాబు ప్రజలు తనను సంక్షేమ పథకాలు ఎక్కడ అడుగుతారో అనే భయంతో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడి, ప్రజల దృష్టిని మరల్చే యత్నం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన తప్పుకు క్షమాపణ చెప్పి నిందితులను అరెస్టు చేయాలని, ఇకనైనా తనతీరు మార్చుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్‌లు వంగా పోలారెడ్డి, ఉప సర్పంచ్‌ ఉయ్యూరు వెంకటరెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సైబర్‌ మోసగాళ్లపై అప్రమత్తత అవసరం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లి రూరల్‌: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్‌ నేరాలు, మోసగాళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేఎల్‌యూ సైన్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ కె. సుబ్రహ్మణ్యం సూచించారు. తాడేపల్లి రూరల్‌పరిధిలోని ప్రాతూరులో శనివారం కేఎల్‌యూ ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ఆధ్వర్యంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సైబర్‌ నేరాలు జరిగే విధానం, వాటికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. ఓటీపీ, కేవైసీ, పెట్టుబడులు, పార్ట్‌టైం జాబ్‌, డిజిటల్‌ అరెస్ట్‌, మొబైల్‌ సిమ్‌ అప్‌గ్రేడ్‌ తదితర మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించామని బీసీఏ విభాగాధిపతి కె. భగవాన్‌ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ పి. ఉషారాణి, అధ్యాపకురాలు లక్ష్మీప్రసన్న, వలంటీర్లకు, సహకారం అందించిన ప్రాతూరు గ్రామస్తులకు కేఎల్‌యూ వైస్‌ చాన్సలర్‌ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్‌ చాన్సలర్లు ఎ.వి.ఎస్‌. ప్రసాద్‌, ఎన్‌. వెంకట్రామ్‌, డీన్‌ స్టూడెంట్‌ అఫైర్స్‌ కె.ఆర్‌.ఎస్‌. ప్రసాద్‌, డీన్‌ సలహాదారు హబీబుల్లా ఖాన్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం కో– ఆర్డినేటర్‌ పి. శ్రీకాంత్‌ రెడ్డి తదితరులు అభినందలు తెలిపారు.

కేఎల్‌యూలో పూర్వ విద్యార్థుల సందడి



పూర్వ విద్యార్థులతో వీసీ పార్థసారథివర్మ, డైరెక్టర్‌ శ్రీకావ్య, ప్రిన్సిపాల్‌ సుబ్రహ్మణ్యం తదితరులు

తాడేపల్లి రూరల్‌: కేఎల్‌ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేసి వివిధ దేశాల్లో స్థిరపడిన వారంతా శనివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సంబంధాల విభాగ డైరెక్టర్‌ కె.సీహెచ్‌ శ్రీకావ్య కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వైస్‌ చాన్సలర్‌ జి. పార్థసారథివర్మ మాట్లాడుతూ 2010–2014లో ఇంజినీరింగ్‌, నాన్‌ ఇంజినీరింగ్‌ చదివిన వారి కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. దశాబ్దం తరువాత విద్యార్థులంతా కలుసుకుని, ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రో వైస్‌ చాన్సలర్‌ ఎ.వి.ఎస్‌. ప్రసాద్‌ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యాభ్యాసం పూర్తి చేసుకోబోతున్న విద్యార్థులు విదేశాలలో చదువుకోవడానికి పూర్వ విద్యార్థులు మార్గదర్శకత్వాన్ని అందించాలని కోరారు. ప్రో వైస్‌ చాన్సలర్‌ కె. రాజశేఖర్‌ మాట్లాడుతూ అకడమిక్‌ విద్యా సంవత్సరంలో ఏదో ఒక సందర్భంలో పూర్వ విద్యార్థులు వర్సిటీని సందర్శించి తమ విలువైన సలహాలను, సూచనలను అందించాలని కోరారు. కన్వీనర్‌ శ్రీకావ్య మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు దేశాల నుంచి పూర్వ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 2019 బ్యాచ్‌ బీసీఏ విద్యార్థి ఆర్‌. వంశీకృష్ణ రూపొందించిన దోస్త్‌ అనే యాప్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ కె. సుబ్రహ్మణ్యం, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్‌ కె.ఆర్‌.ఎస్‌. ప్రసాద్‌, పరిశోధనా విభాగ డైరెక్టర్‌ శరత్‌, కో కన్వీనర్‌ సోని, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాటలతో మస్కా కొట్టిన కేటుగాడు

ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌, పర్సుతో పరారీ



ద్విచక్ర వాహనంతో ఉడాయిస్తున్న కేటుగాడు

మంగళగిరి: మాటలతో మస్కా కొట్టి ఓ కేటుగాడు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌, పర్సుతో పరారీ అయిన ఘటన శనివారం మంగళగిరిలో చోటు చేసుకుంది. రూరల్‌ పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. యర్రబాలేనికి యెలిమిచర్ల దుర్గారావు ఆటోనగర్‌లోని ఓ హోటల్‌లో వాచ్‌మేన్‌గా పని చేస్తుండాడు. శుక్రవారం సాయత్రం ఓ ఆగంతకుడు అతడు వద్దకు వెళ్లాడు. మంచి బియ్యం, గోధుమపిండి, నిత్యావర సరకులు ఉన్నాయని, వాటితో పాటు మూడు లీటర్ల పెట్రోల్‌ రూ. వందని మాయమాటలు చెప్పాడు. అన్నీ కలిపి రూ. 1700కే ఇస్తానని నమ్మబలికాడు. దుర్గారావు ఆ మాయమాటల్ని నమ్మాడు. కుమారుడు సత్యసాయిని రమ్మని పిలిచి , ద్విచక్ర వాహనంపై ఆగంతకుడితో వెళ్లి సరుకులు తీసుకుని రావాలని చెప్పాడు. రైల్వేస్టేషన్‌ దగ్గరకు వెళ్లగానే ఆగంతకుడు వాహనం ఆపించి తాను ఎక్కాడు. సత్యసాయి సెల్‌ఫోన్‌ తీసుకుని తండ్రితో మాట్లాడుతుండగా దాన్ని లాక్కుని వాహనంపై పరారయ్యాడు. జరిగిన మోసంపై దీంతో దుర్గారావు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజీహెచ్‌ఎస్‌ వెల్‌నెస్‌ సెంటర్‌లో సౌకర్యాలు కల్పించాలి

లక్ష్మీపురం: సెంట్రల్‌ గవర్నమెంట్‌ హెల్త్‌ స్కీం (సీజీహెచ్‌ఎస్‌) వెల్‌నెస్‌ సెంటర్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్‌శాఖ కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఏపీ సెంట్రల్‌ ఎక్సైజ్‌ పెన్షనర్ల సంఘం సీజీహెచ్‌ఎస్‌ కో– ఆర్డినేటర్‌ గుమ్మడి సీతారామయ్య చౌదరి కోరారు. కలెక్టరేట్‌ ఎదురుగా గల సీజీహెచ్‌ఎస్‌ వెల్‌నెస్‌ సెంటర్‌ శనివారం మంత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీతారామయ్య చౌదరి ఆయన దృష్టికి సమస్యల్ని తీసుకు వచ్చారు. గుంటూరు వెల్‌నెస్‌ సెంటర్‌ను అప్‌గ్రేడ్‌ చేయాలని, అన్ని వైద్య, పరీక్ష సదుపాయాలు కల్పించాలని మంత్రిని కోరారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఒక్కటే సెంటర్‌ ఉండటంతో పెన్షనర్లు, ఉద్యోగులు గుంటూరుకు రావడం వ్యయ ప్రయాసలతో కూడుకుందని తెలిపారు. ప్రతి నూతన జిల్లాలోనూ వెల్‌నెస్‌ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని ఆయన అభ్యర్థించారు. స్పందించిన మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో సీజీహెచ్‌ఎస్‌ డాక్టర్లు ఎం.సీహెచ్‌.కోటేశ్వరరావు డి.తుకారామ్‌, బేగం, ఆయేషా, రామారావు, మురళి పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూనగర్‌: సచివాలయ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్‌ నాయకులు శనివారం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థలో వార్డు శానిటేషన్‌ సెక్రటరీలను డిగ్రీ అర్హతతో టెక్నికల్‌ సర్వీస్‌ కోసం నియామకం చేసుకుని, కేవలం నాన్‌ టెక్నికల్‌ సర్వీసెస్‌కు వినియోగించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేషనలైజేషన్‌లో శానిటేషన్‌, పర్యావరణ సెక్రటరీలను వారి లైన్‌ డిపార్ట్‌మెంట్స్‌ అయిన పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డ్‌, మినిస్ట్రీ ఆఫ్‌ ఎన్విరాన్మెంట్‌ అండ్‌ ఫారెస్ట్రీ, మెడికల్‌ అండ్‌ హెల్త్‌, ఇతర ప్రభుత్వ శాఖల్లో వారి విద్యార్హతలకు అనుగుణంగా సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం శానిటేషన్‌, ఎన్విరాన్మెంట్‌ కార్యదర్శుల అసోసియేషన్‌ ట్రెజరర్‌ దుర్గారావు, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బుల్లయ్య, జాహ్నవి, కవిత, దివ్య, సునీత, అరుణ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధం



ఢిల్లీలోని ఏపీ భవన్‌ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

నెహ్రూనగర్‌: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగానికి విరుద్ధం అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్‌ పేర్కొన్నారు. సుప్రీం తీర్పుకు వ్యతిరేకంగా ఢిల్లీలోని ఏపీ భవన్‌ వద్ద రెండో రోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌ మాట్లాడుతూ కేంద్రం కనుసన్నల్లో సుప్రీం కోర్టు తీర్పు వెలువడిందని ఆరోపించారు. వర్గీకరణ తీర్పును తెలుగు రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ముఖ్యమంత్రులు అమలు చేయాలని చూస్తే కచ్చితంగా రానున్న స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వర్గీకరణ తీర్పుతో రిజర్వేషన్లకే ప్రమాదం పొంచి ఉందన్నారు. అప్పటి జనాభా నిష్పత్తి ప్రకారం అంబేడ్కర్‌ రాజ్యాంగంలో కల్పించిన 15శాతం రిజర్వేషన్లకే దళితులు పరిమితమయ్యారని తెలిపారు. నేడు ఆ రిజర్వేషన్లనే విభజించి పాలించే సిద్ధాంతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నుకున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గోదా జాన్‌పాల్‌, రామచందర్‌, తాళ్లపల్లి రవి, కొండబాబు, సుధాకర్‌, నీలాంబరం, కుమారి, సునీత, పున్నమ్మ, నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యా బోధనలో ప్రమాణాలు అవసరం



మాట్లాడుతున్న విద్యావేత్త రమ

గుంటూరు ఎడ్యుకేషన్‌: ప్రాథమిక విద్యా బోధనలో ఆధునికత్వంతో కూడిన ప్రమాణాలు అవసరమని నేషనల్‌ లీడర్‌షిప్‌ ప్రోగ్రాం అతిథి ఉపన్యాసకురాలు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్‌ ఆర్‌.కె.రమ పేర్కొన్నారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో ప్రీ–ప్రైమరీ, ప్రైమరీ ఉపాధ్యాయులకు జాతీయ విద్యా విధానం, జాతీయ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్‌తో పాటు చైల్డ్‌ ప్రొటెక్షన్‌ చట్టంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్‌ రమ మాట్లాడుతూ పిల్లల సమగ్రాభివృద్ధికి చిన్నతనంలోనే బాటలు వేయాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఆధునిక విద్య పాఠ్యాంశాలకు అనుగుణంగా ప్రీ–ప్రైమరీ, ప్రైమరీ విద్య బోధిస్తున్న ఉపాధ్యాయులు తమను తాము మలచుకుంటూ బోధించాలని, తద్వారా పిల్లల సమగ్రాభివృద్ధికి పసితనంలోనే బాటలు వేసిన వారవుతారని పేర్కొన్నారు. గత దశాబ్దంగా పాత మూస బోధనలకు భిన్నంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన జాతీయ విద్యా విధానానికి రూపకల్పన చేస్తున్నారని తెలిపారు. కాలానుగుణంగా పిల్లల్లో వారి ఐక్యూస్థాయికి తగిన విధంగా సమగ్ర వికాసానికి బోధనాంశాలు ఉండాలని సూచించారు. ఎర్లీ చైల్డ్‌ ఎడ్యుకేషన్‌, చైల్డ్‌ ప్రొటెక్షన్‌ చట్టాలపై విజ్ఞాన్‌ అధ్యాపకురాలు డాక్టర్‌ నాగమల్లేశ్వరి, అధ్యాపకురాలు రమ మావూరి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్‌ నాయుడు చక్రనాగ్‌, ప్రిన్సిపాల్‌ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌ విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కరస్పాండెంట్‌ ఫాదర్‌ బాలస్వామి, వైద్యులు

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రు సమీపంలో ఉన్న యూనివర్సల్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో హెల్ప్‌ ఫౌండేషన్‌, హనుమ ఐకేర్‌ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రెవరెండ్‌ ఫాదర్‌ డాక్టర్‌ పామిశెట్టి బాలస్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కంటి పరీక్షలు చేయించుకొని దృష్టి లోపాలు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. నేటి యువత ఎక్కువగా సెల్‌ఫోన్లు, ల్యాబ్‌ ట్యాప్‌లు ఉపయోగిస్తున్నారని, వీటివల్ల దృష్టి లోపాలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. డాక్టర్‌ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చక్కని కంటి చూపునకు క్యారెట్‌, కోడి గుడ్లు, ఆకుకూరలు, బొప్పాయి తీసుకోవాలని సూచించారు. కళ్లు పొడిబారడం, ఎర్రబడడం, నీళ్లు కారడం వంటి సమస్యలు ఉంటే వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ కేశవరెడ్డి, కంచర్ల బుల్లిబాబు, ఎన్‌. రమేష్‌, ఫిజికల్‌ డైరెక్టర్‌ మర్రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిడమర్రు కొట్లాట కేసులో తొమ్మిది మంది అరెస్టు



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని నిడమర్రులో ఇటీవల జరిగిన కొట్లాట కేసులో తొమ్మిది మంది యువకుల్ని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రూరల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6న నిడమర్రు గ్రామానికి చెందిన కలవకొల్లు నాగరాజుపై పట్టణానికి చెందిన తొమ్మిది మంది యువకులు గొడవపడి, దాడిచేసి గాయపరచారు. దీంతో నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దాడి చేసిన యువకులు కుర్ర గణేష్‌, ఏసుబాబు, కూరాకుల మాధవ్‌, తాడిబోయిన పూర్ణశంకర్‌లతో మరో ఐదుగురిని పోలీసులు అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌ విధించారు.

అలరించిన కూచిపూడి నృత్య నీరాజనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌ గార్డెన్స్‌ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం భగవాన్‌ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహించారు. డాక్టర్‌ లలిత్‌ ప్రకాష్‌చంద్ర, డాక్టర్‌ ప్రవీణ్‌ నల్లపాటి, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్‌.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శుభ గాత్రీ ఆర్ట్స్‌ అకాడమీ వ్యవస్థాపక నాట్యాచార్యులు బీరక సురేష్‌ బాబు, శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కుమారి యశస్వి శుభగాత్రీ, రమ్య, నిఖిత, కీర్తన, చైత్ర, హాసిని, హన్సిక తదితరుల చక్కటి హావ భావాలతో నృత్యం చేశారు. నట్టువాంగంపై బీరక సురేష్‌బాబు, గాత్రం సీహెచ్‌. శాంతి, బంకుపల్లి విద్యాసాగర్‌ (నూజివీడు), వయోలిన్‌పై నాగేశ్వరరావు, మృదంగంపై వెంకట భరద్వాజ్‌, ఘటంపై ఏం.హరిబాబు, వేణువుతో వనమాలీ చక్కటి వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్‌ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలితాదేవి, కార్యదర్శి ఎ.మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొన్నారు. చివరగా అతిథులు కళాకారుల్ని సత్కరించారు.

వరద బాధితుల సహాయనిధి సేకరణ



నిధి సేకరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తాడేపల్లి రూరల్‌: కేరళలోని వయనాడు వరద బాధితుల్ని ఆదుకునేందుకు రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడులో సహాయనిధిని సేకరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య మాట్లాడుతూ ఆల్‌ ఇండియా కిసాన్‌ సభ పిలుపు మేరకు వయనాడు వరద బాధితులకు ఆదుకునేందుకు రేవేంద్రపాడులోని హారిక కాలేజీలో విరాళాల సేకరణ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ అన్నే నవీన్‌కుమార్‌, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు, వ్యవసాయ కార్మికుల నాయకులు బాలరాజు, స్థానిక నాయకులు బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి, శంకర్‌, జేమ్స్‌ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

గుంటూరు పట్టణ క్రైస్తవ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న దళిత క్రైస్తవ సంఘ నాయకులు

నెహ్రూనగర్‌: మతం ప్రాతిపదికన కాకుండా కులం ప్రాతిపదికన దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ గుంటూరు పట్టణ క్రైస్తవ సంఘాల సమాఖ్య ప్రతినిధులు రెవరెండ్‌ జి.సతీష్‌ బాబు, పాదర్‌ చంద్రమోహన్‌ నుదురుపాటి ఆధ్వర్యంలో శనివారం జాతీయ క్రైస్తవ నిరసన దినం పాటించారు. గుంటూరు సెయింట్‌ మాథ్యూస్‌ వెస్ట్‌ పారిస్‌ చర్చి నుంచి ఆంథోనీ వారి చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్‌ సతీష్‌బాబు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు విఘాతం కలిగించే అంశాల్ని నిర్మూలించి, క్రైస్తవులకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. 1950 ఆగస్టు 10న తేదీన రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా వెలువడిన రాజ్యాంగ ఆర్డర్‌లోని మూడవ పేరాలో హిందూ మతంలో దళితులకు మాత్రమే ఎస్సీ కోటా వర్తిస్తుందని పేర్కొన్నారు. దీనిపై గత 70 సంవత్సరాలుగా వివాదం జరుగుతూనే ఉందన్నారు. ఫాదర్‌ చంద్రమోహన్‌ మాట్లాడుతూ దళితులు, గిరిజనులు ఏమతంలో ఉన్నా వారి సామాజిక, ఆర్థిక వెనుకబాటు తనంలో పెద్దగా మార్పులేదని పలు అధ్యయన సంస్థలు పేర్కొన్నాయన్నారు. చాలా మంది దళిత క్రైస్తవులు దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నారని, అన్ని రకాల దోపిడీకి, సామాజిక వివక్షకు గురవుతున్నారని జస్టిస్‌ రంగనాథ్‌ మిశ్రా కమిషన్‌ పేర్కొందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని కోరారు. కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు రెవరెండ్‌ విల్సన్‌, రెవరెండ్‌ చక్రధర్‌, రెవరెండ్‌ ఆశీర్వాదం, మనోహర్‌, కార్పొరేటర్‌ బూసీ రాజలత, కర్రా హనోక్‌ బెంజిమెన్‌, వివిధ సంఘాల పాస్టర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్వాతంత్ర్యోద్యమ చరిత్రపై విద్యార్థులకు అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్‌: దేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చిల్డ్రన్స్‌ స్పేస్‌ క్లబ్‌ ఆఫ్‌ ఇండియా, ఇండియన్‌ ఇంటిలెక్చ్యువల్‌ ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా విధానంలో శాస్త్ర, సాంకేతిక రంగాలకే ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు. చరిత్రను పాఠశాలస్థాయికే పరిమితం చేస్తూ విశ్వ విద్యాలయాల స్థాయిలో విస్మరించడం పూడ్చలేని అగాధం ఏర్పడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో భారత స్వాతంత్ర్య ఉద్యమం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వివిధ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలతో పాటు సంగిరెడ్డి హనుమంతరెడ్డి చరిత్రపై ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఈనెల 12న గుంటూరు కొత్తపేటలోని కాసు శాయమ్మ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల, ఈనెల 13న పట్టాభిపురంలోని టీజేపీఎస్‌ కళాశాల, ఈనెల 14న లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని శాంతమూర్తి తెలిపారు.